ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- పరకాలలో రాత్రి 8గంటల వరకు కొనసాగిన పోలింగ్ ప్రక్రియ
- ఆకర్షణీయంగా పోలింగ్ కేంద్రాల ముస్తాబు
- తరలివచ్చిన నూతన ఓటర్లు
- ఆసక్తిగా ఓటు వేసిన వృద్ధులు


ఐనవోలు: ఓటు వేయడానికి బారులుదీరిన ఓటర్లు


ఎల్కతుర్తి : పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్‌లో నిలుచున్న ఓటర్లు

పరకాల: పరకాల మండలంలో అసెంబ్లీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 11 పోలింగ్ బూత్‌లను సమస్యాత్మకమైనవిగా గుర్తించిన పోలీసులు ఆయా బూత్‌ల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ బూత్‌లకు దూరంలోనే గీత గీసిన అధికారులు.. రాజకీయ పార్టీ నాయకులను లోపలికి అనుమతించలేదు. చిన్న గొడవలు మినహా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ మందకొడిగానే కొనసాగింది. 1గంట తర్వాత ఓటర్లు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో బారులుదీరి కనిపించారు. ఎన్నికల్లో యువత ఎంతో ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్న ఓటర్లకు రాత్రి 8గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ఇదిలా ఉండగా..పరకాల పట్టణంలోని మాధారం కాలనీ అంబేడ్కర్ భవన్‌ను మోడల్ పోలింగ్ స్టేషన్(నెం.36)గా ముస్తాబు చేశారు. ఇద్దరు కవలలు మొదట ఓటు హక్కును వినియోగించుకోగా పోలింగ్ అధికారులు సన్మానించి అభినందించారు.

నడికూడ: మండల కేంద్రంలో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. వరికోల్, కంఠాత్మకూర్ గ్రామాల్లో పోలింగ్ మధ్యలో ఈవీఎం మొరాయించడంతో అధికారులు సరిచేశారు. దీంతో అర్ధగంట ఆలస్యంతో పోలింగ్ కొనసాగింది.

కమలాపూర్‌లో 85.4శాతం పోలింగ్

కమలాపూర్: హుజూరాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్ మండలంలో పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై రాత్రి 7 గంటలకు ముగిసింది. సాయంత్రం వేళ కమలాపూర్, వంగపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్ద ఎత్తున బారులుదీరారు. దీంతో అక్కడ రాత్రి 7 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. బీజేపీ హుజూరాబాద్ అభ్యర్థి ఈటల రాజేందర్ తన సతీమణి జమునతో కలిసి కమలాపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వొడితల ప్రణవ్ పలు గ్రామాల్లో ఓటింగ్ సరళిని పరిశీలించారు. కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, కమలాపూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 85.4 పోలింగ్ శాతం ఓట్లు పోలయ్యాయని ఏఆర్వో, తహసీల్దార్ పి.మాధవి తెలిపారు. మండలంలోని పంగిడిపల్లి గ్రామంలోని 259 నంబరు పోలింగ్ కేంద్రంలో గంట పాటు ఈవీఎంలు మొరాయించడంతో అధికారులు వాటిని సరి చేసి పోలింగ్ కొనసాగించారు.

ఆత్మకూరు: మండలకేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఉదయం 7గంటల నుంచే ఓటర్లు బారులుదీరారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ బూత్‌లలో పోలింగ్ రాత్రి వరకు కొనసాగింది. హౌజుబుజుర్గు, అగ్రంపహాడ్‌లో పోలింగ్ ఆలస్యమైంది. కేంద్ర ఎన్నికల పరిశీలకులు రాహుల్, గోపాల కృష్ణ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండలంలో స్వల్ప వాగ్వాదాలు మినహా ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోలేదు. సీఐ రవిరాజు శాంతి భద్రతలను పర్యవేక్షించారు. తహసీల్దార్ సురేష్‌కుమార్ పరిస్థితిని సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో భోజన వసతి సరిగా లేకపోవడంతో పోలింగ్ సిబ్బంది ఇబ్బంది పడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ సరళిని పరిశీలించారు.

ఎల్కతుర్తిలో 85శాతం..

ఎల్కతుర్తి: ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద కేంద్ర బలగాలను ఏర్పాటు చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎల్కతుర్తి మండలంలో 85 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారుల వెల్లడించారు. ఎస్సైలు సాయిబాబు, రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వేలేరు: మండలంలో పలుచోట్ల పోలింగ్ సమయం ముగిసినా క్యూ లైన్‌లో ఉన్న వారిని ఓటు వేసేందుకు అనుమతించారు. దీంతో సాయంత్రం 6.20 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఐనవోలు: మండలంలోని 17 గ్రామాల్లో ఓటింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసిందని తహసీల్దార్ విక్రమ్ కుమార్ తెలిపారు. నందనం, పంథిని లో ఈవీఎమ్‌లు మొరాయించాయి. మండల వ్యాప్తంగా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో 86.38 శాతం పోలింగ్ నమోదుకాగా.. స్టేషన్ ఘన్‌పూర్ పరిధిలోని గర్మిళ్లపెల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో 87.98 శాతం ఓటింగ్ నమోదైనట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే అభ్యర్థులు అరూరి రమేష్, కేఆర్ నాగరాజు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. జిల్లా ఎన్నికల అధికారి షణ్ముక రాజన్, ఇతర ఎన్నికల ప్రత్యేక అధికారులు మండలంలో పర్యటించారు.

ఐదు గ్రామాల్లో రాత్రి 7వరకు..

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామం మినహా మిగిలిన గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గట్లకానిపర్తి గ్రామంలో మాక్ పోలింగ్ సమయంలో వీవీ ప్యాట్లు మొరాయించగా అధికారులు వాటిని మార్చి కొత్తవి ఏర్పాటు చేశారు. పోలింగ్ స్టేషన్ 316లో ఈవీఎం కొద్దిసేపు మొరాయించడంతో టెక్నీషియన్ సరిచేయగా యథావిధిగా పోలింగ్ కొనసాగింది. సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మైలారంలో అధికార పార్టీకి చెందిన నాయకులు పోలింగ్ కేంద్రంలోని క్యూలైన్‌ల వద్ద నిలబడి ప్రచారం చేస్తుండంతో కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం చెప్పారు. గ్రామానికి చెందిన నూనె కిరణ్ ఏజెంట్ రిలీవర్ పేరుతో పోలింగ్ కేంద్రంలో ఉండగా కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రొసిడింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేయగా అతన్ని బయటికి పంపించారు. పలుమార్లు అధికార పార్టీ కార్యకర్తలు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి వస్తుండడంతో ఒక దశలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేశారు. శాయంపేట గ్రామంలోని పోలింగ్ స్టేషన్ 305, మైలారంలోని పోలింగ్ స్టేషన్ 303లో రాత్రి 7గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. శాయంపేట మండలంలోని కొన్ని పోలింగ్ కేంద్రాలలో 90 శాతంకు పైగా పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు.


ఎల్కతుర్తి: పోలింగ్ కేంద్రానికి వస్తున్న వృద్ధ దంపతులు


దామెర: తల్లి ఓటు వేయడానికి వెళ్లగా పాపను ఎత్తుకొని ఆడిస్తున్న సిబ్బంది

దామెర: మండల వ్యాప్తంగా 90 శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయ పనుల కారణంగా పోలింగ్ ఉదయం కొంత మందకోడిగా సాగినప్పటికీ ప్రజలు మధ్యాహ్నం అధిక సంఖ్యలో పోలింగ్ స్టేషన్లకు ఓటర్లు చేరుకోవడంతో సందడికన్పించింది. మండలంలోని పులుకుర్తి, ల్యాదెళ్ల, దామెర, ఒగ్లాపూర్, ఊరుగొండ గ్రామాల్లో ఏర్పాటుచేసిన పోలింగ్ స్టేషన్లను బీఆర్ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి పరిశీలించారు. దామెరలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, తక్కళ్లపహాడ్‌లో ప్రముఖ సినీ సంగీత దర్శకుడు, రచయిత వరంగల్ శ్రీనివాస్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్సై ముత్యం రాజేందర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఎల్కతుర్తిలో ఓటు హక్కు వినియోగించుకున్న యువత




పరకాలలో..


ధర్మసాగర్‌లో..


ఆత్మకూరులో..


కమలాపూర్ : ఓటు వేసిన మరుగుజ్జు అక్కాచెల్లెళ్లు


ఆత్మకూరు: పరిశీలిస్తున్న అధికారులు


దామెరలో క్యూలో ఉన్న మహిళలు


పరకాల: ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు



పరకాల: ఆస్పత్రి నుంచి నేరుగా వచ్చిన యువకులు


నడికూడ: మండల కేంద్రంలో బారులుదీరిన ఓటర్లు


శాయంపేట:మైలారంలో ఓటర్లను క్యూ పద్ధతిలో ఉంచుతున్న ఎస్సై


ధర్మసాగర్ : ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు


పరకాల: గుంపుగా ఉన్న ప్రజలను చెదరగొడుతున్న పోలీసులు


వేలేరు: వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న సిబ్బంది


దామెరలో..


ఐనవోలులో..


ఎల్కతుర్తిలో ఓటు వేసిన ముస్లిం మహిళలు


పరకాల: ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధులు


పరకాల: తొలి ఓటర్లను సన్మానిస్తున్న అధికారులు

క్లుప్తంగా

పోలింగ్ బూత్‌లో కార్పొరేటర్ ప్రచారం


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

కాశిబుగ్గ: వరంగల్ 18వ డివిజన్ క్రిస్టియన్ కాలనీ గ్రెయిన్ మార్కెట్ స్కూల్‌లోని బూత్ వద్ద పోలింగ్ గడువు ముగుస్తున్న సమయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి స్థానిక కార్పొరేటర్ వస్కుల బాబు ప్రచారం చేశారు. ఇది గమనించిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కార్పొరేటర్‌ను బయటకు పంపాలంటూ నినాదాలు చేశారు. అప్పటికి అక్కడే ఉన్న పోలీసులు పట్టించుకోకపోవడంతో మూసి ఉన్న గేటును బద్దలు కొట్టి లోపలకు వెళ్లి వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. పోలీసులు బూత్ వద్దకు చేరుకుని అక్కడున్న వారందరిని చెదరగొట్టారు.

ఓటు వేసిన వృద్ధులు, దివ్యాంగులు


వీల్‌చైర్‌లో వృద్ధురాలిని తీసుకొస్తున్న జబ్బార్

ఖిలా వరంగల్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ ఎస్ఆర్ఆర్ తోటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో దివ్యాంగులు, వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారికి తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ.జబ్బార్ సహకారం అందించారు. వీల్ చైర్‌లో తీసుకుచ్చి ఓటు వేయించి తిరిగి ఇంటికి క్షేమంగా చేర్చారు.

ఓటుహక్కును వినియోగించుకున్న దివ్యాంగురాలు



కాజీపేట అర్బన్: ఓ దివ్యాంగురాలు వీల్ చైర్‌లో వచ్చి తన ఓటుహక్కును వినియోగించుకుంది. ఈమేరకు ఆమెను కడిపికొండకు చెందిన ఎల్లేష్ పోలింగ్ బూత్‌కు తీసుకుని వచ్చాడు.

వృద్ధులకు చేయూత



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో తెలంగాణ జాగృతి యువజన నాయకుడు, సామాజిక సేవకుడు అమ్మ అశోక్ గురువారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వృద్ధులకు చేయూతనిచ్చాడు. పోలింగ్ కేంద్రానికి చే తుల్లో ఎత్తుకెళ్లి ఓటు వేయించాడు. శాయంపేట గ్రామంలో ప్రదీప్ ఎన్నికల ముగింపు సమయానికి ఒక నిమిషం ముందు వస్తున్న వృద్ధురాలిని ఓటు వేయించడానికి చేతులపై పోలింగ్ కేంద్రానికి ఎత్తుకెళ్లి ఓటు వేయించాడు.

ఓటు వేసిన ట్రాన్స్‌జెండర్లు

కరీమాబాద్: శాసనసభ ఎన్నికల్లో భాగంగా గురువారం జరిగిన పోలింగ్ ప్రక్రియలో ట్రాన్స్‌జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వరంగల్ తూర్పులోని ఎస్ఆర్ఆర్‌తోట 111వ పోలింగ్ కేంద్రంలో వారు సామూహికంగా ఓటు వేశారు.

సాగర్ ఎడమకాల్వలో జారిపడి వ్యక్తి మృతి


అజ్గర్ అలీ మృతదేహం

మునగాల(కోదాడ): సాగర్ ఎడమకాల్వలో ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. వరంగల్ జిల్లాకు చెందిన అజ్గర్ అలీ(48) భార్య షహనాజ్ సూర్యాపేట జిల్లా నడిగూడెం గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ వైద్యురాలిగా పనిచేస్తోంది. దీంతో అజ్గర్ అలీ కుటుంబం కొంత కాలంగా మునగాల మండలంలోని బరాఖత్‌గూడెంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. గురువారం సాయింత్రం ఏడు గంటల సమయంలో అజ్గర్ అలీ తన కుమార్తెను తీసుకొని మునగాల శివారులోని సాగర్ ఎడమకాల్వలో స్నానం చేసేందుకు వెళ్లాడు. కుమార్తెకు స్నానం చేయించి ఒడ్డున కూర్చోబెట్టి తనూ స్నానం చేసేందుకు ఉపక్రమించాడు. ఈ క్రమంలో అజ్గర్ అలీ కాలుజారి కాల్వలో పడి మునిగిపోయాడు. కుమార్తె కేకలు వేయడంతో పరిసర ప్రాంతానికి చెందిన రైతులు కాల్వలోకి దిగి వెతకగా అజ్గర్ అలీ మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మునగాల పోలీసులు తెలిపారు.

ఓటు వేసి వస్తుండగా ప్రమాదం

గీసుకొండ: కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆర్చిగేట్ సమీపంలో వరంగల్–నర్సంపేట రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఖానాపురం మండలం రంగంపేటకు చెందిన వి.రవీందర్, ఆయన భార్య మానస, కుమారులు హర్షవర్ధన్, చైతన్య గ్రామంలో ఓటు వేసి వస్తుండగా సాయంత్రం వరంగల్ వైపు నుంచి వస్తున్న వారి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మానసకు తీవ్ర గాయాలు కాగా, మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

నరేందర్‌పై కేసు నమోదు

రామన్నపేట: ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద ఎమ్మెల్యే నరేందర్‌పై కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. వరంగల్ దుర్గేశ్వరస్వామి గుడి వీధి శాంతినికేతన్ హైస్కూల్‌లోని 44వ పోలింగ్ బూత్‌లో పోలింగ్ సరళిని పరిశీలిస్తూ ఫోన్‌లో మాట్లాడిన నరేందర్.. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించారు. దాంతో ఎమ్మెల్యే నరేందర్‌పై మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్ ఇన్‌చార్జ్ కే.రాజయ్య ఫిర్యాదు చేయగా గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

కానిస్టేబుల్ ఓవర్ యాక్షన్

హసన్‌పర్తి: హసన్‌పర్తిలో ఓ కానిస్టేబుల్ ఓవర్‌యాక్షన్ చేశాడు. పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్న షాపులను కూడా బంద్ చేయాలని హుకుం జారీ చేశాడు. లేకుంటే కేసులు నమోదు చేస్తానని హెచ్చరించాడు. పోలింగ్ కేంద్రాలకు షాపులు దూరంగా ఉన్నప్పటికీ ఎందుకు బెదిరింపులకు గురి చేస్తున్నారని షాపుల నిర్వాహకులు ప్రశ్నించారు. సదరు కానిస్టేబుల్ వ్యవహారంపై ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు.

పోలీసులపై ఆగ్రహం

హసన్‌పర్తిలో అధికార పార్టీకి పోలీసులు సహకరిస్తున్నారని ప్రతిపక్ష పార్టీలు మండిపడ్డాయి. పోలింగ్ కేంద్రాల్లో అధికార పార్టీల నాయకులకు అనుమతి ఇస్తూ తమను నెట్టివేస్తున్నారని ప్రతిపక్షా పార్టీల నాయకులు ఆరోపించారు. మడిపల్లి, ఎల్లాపురంలో పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే అరూరి గో బ్యాక్ అంటూ నినాదాలు


నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఐనవోలు: మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అరూరి రమేష్ గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేశారు. గురువారం మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. సింగారం, ముల్కలగూడెం, కొండపర్తి, వనమాల కనపర్తి గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను సందర్శించిన అనంతరం ఒంటిమామిడిపల్లికి చేరుకున్నారు. కాగా ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు అరూరి రమేష్ గోబ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రెవెన్యూ గ్రామం కాకుండా ఎమ్మెల్యే రమేష్ అడ్డుకున్నాడని ఆరోపణలు చేస్తూ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. పోలింగ్ స్టేషన్‌లోకి అరూరి వెలుతుండగా ఒక్కసారిగా కాంగ్రెస్ నాయకులు లోపలికి చొచ్చుకుని వచ్చారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు చేయి చేసుకునే ఉద్రిక్త పరిస్థితి స్వల్ప కాలంలో తలెత్తింది. అప్రమత్తమైన పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది ఇరు పార్టీల నాయకులను బయటకు గెంటేసి పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం పోలింగ్ సరళిని పరిశీలించిన ఆయన ఐనవోలు, పున్నేలు గ్రామాలను సందర్శించి అక్కడినుంచి వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రానికి వెళ్లారు.